క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



తనిఖీ చేస్తున్న ఆర్డీఓ గణేష్, పోలీసులు

ఎర్రుపాలెం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖమ్మం ఆర్డీఓ గణేష్ హెచ్చరించారు. ఆదివారం రాష్ట్ర సరిహద్దులో, స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను నిలిపివేసి తనిఖీ చేయించారు. స్థానిక ఎస్సై వెంకటేష్, తహసీల్దార్ ఉషాశారదలతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహన తనఖీలు ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎస్సై నరేష్, అధికారులు

ముదిగొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వల్లబి చెక్కు పోస్ట్‌ను ఆదివారం అధికారులు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో పాటు నిత్యం నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలని ఎస్సై నరేష్ తెలిపారు. ఎన్నికల నిభందనలు ఉల్లగించిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పలు రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను సిబ్బందిచే తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీఓ సూర్యనారాయణ, ఏఎస్సై సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



బ్రహ్మయ్య

బోనకల్: తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా గోవిందాపురం గ్రామానికి చెందిన తమ్మారపు బ్రహ్మయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ బస్వరాజు శంకర్ నియామకపు పత్రాన్ని ఆదివారం హైద్రాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల అభివృద్ధి కొరకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ తిరుమలాదేవి

తల్లాడ: తల్లాడలోని శివాలయం సమీపంలో ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత కుట్టు మిషన్ శిక్షణాకేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, ఎంపీటీసీ చల్లా తిరుమలాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తిరుమలాదేవి సుధాకర్ మాట్లాడుతూ.. మహిళల సాధికారత కోసం సత్యమార్గం సొసైటీ ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సత్యమార్గం సొసైటీ నిర్వహకురాలు శ్రీలక్ష్మి, వేము రజిత, ఇమాంబి, కటికి కిరణ్‌కుమార్, చల్లా నాగులు, మహేష్, జమాల్ పాల్గొన్నారు.

మురుగు తొలగించండి

ముదిగొండ: మండలంలోని చిరుమర్రిలో వీధుల వెంట ఉన్న మురుగు కాలువలు మురుగుతో నిండి కంపు కొడుతున్నాయి. చెత్తాచెదారం చేరి ముందుకు కదలకపోవడంతో దోమలవ్యాప్తి విజృంభిస్తోంది. సర్పంచ్‌లు గ్రామపంచాయతీల పాలన వదిలి నెల రోజులు దాటిన తరువాత పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో పాఠశాల విద్యార్థులు నివాసగృహాలవారు ఇబ్బందులకు గురౌతున్నారని ఆరోపణలొచ్చాయి. కాలువల్లో పేరుకుపోయిన మురుగును వెంటనే తొలగించాలని చిరుమర్రి వాసులు కోరుతున్నారు.

ముత్తగూడెంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు



పెనుబల్లి: లోక్ సభ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ రాష్ట్రం సరిహద్దు గ్రామమైన మండల పరిధిలోని ముత్తగూడెంలో పోలీసులు అంతరాష్ట్ర స్టేట్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టులో తెలంగాణ నుంచి, ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి.. పోయే వాహనాలను నిత్యం తనిఖీలు చేసి అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

రైతులపై ప్రకృతి కన్నెర్ర..

- చెంతనే మున్నేరున్నా.. ఎడారిగా పొలాలు
- చుక్కనీరు దిగక నెర్రలు బారుతున్న వరిపంట
- దిగాలు పడుతున్న రైతన్నలు
- లిఫ్టులు ఏర్పాటు చేయాలని వేడుకోలు



అమ్మపేట వద్ద వ్యవసాయబావిలో పూడిక తీస్తున్న దృశ్యం(ఫైల్)



గంధసిరిలో నెర్రలు బారిన వరిపొలం

ముదిగొండ: అంగడిలో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది రైతు పరిస్థితి. పండించే ప్రతి పంట అనుకూలంగా ఉన్నాయి. నిరంతర విద్యుత్ సౌకర్యం ఉంది. చెంతనే మున్నేరు ఉంది. అయినా చుక్క నీరు కిందకు దిగదు. వ్యవసాయ బావులూ అడుగంటాయి. వేసవి తీవ్రత అధికమౌవడంతో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. వేసిన పంటలు ఎండుతుండడంతో రైతులు దిగాలు పడుతున్నాడు. మరో పక్క ప్రకృతి కన్నెర చేస్తోంది. చేసేదేమి లేక రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు.

మండలంలో సాగు వివరాలిలా..

ముదిగొండ మండలంలో రైతులు రబీలో 2680ఎకరాల్లో వరి, 4968ఎకరాల్లో మొక్కజొన్న, 2800ఎకరాల్లో మిర్చి, ఇతర పంటలు 480 ఎకరాల్లో ఈ ఏడాది సాగుచేపట్టారు. మున్నేరు పరివాహకప్రాంతాలైన పండ్రేగుపల్లి, కోదండరామారాపురం, ముత్తారం, వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ గ్రామాల సమీపంలో ఉన్నాయి. మున్నేరు ప్రాంతాన వ్యవసాయ మోటార్లపై ఆధారపడి వివిధ పంటలు సాగుచేపడుతుంటారు. ఈ ఏడాది చుక్క నీరు కూడా మున్నేరులో లేకపోవడంతో పాటు బావుల్లో, బోర్లల్లో అడుగంటాయి.

ప్రత్యామ్నాయమే శరణ్యం..

చేతికందిన పంటలను దక్కించుకునేందు రైతులు నానా తంటాలు పడుతున్నారు. వ్యవసాయ బావుల్లో, బోర్లల్లో పూడికలు తీయించి మోటార్ల అమర్చి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. మరో పక్క విద్యుత్ మోటార్లు నీరందక కాలిపోతున్నాయి. చేతికందే పంటలను కాపాడేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నాడు. ముదిగొండ మండలంలో 19,020మంది రైతులు వివిధ పంటలను సాగు చేపడుతున్నారు. రబీలో వేసిన పంటలకు వారబందీ విధానంతోనైనా, సాగర్‌నీరు విడుదల చేసి చేతికందే పంటలను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నెల రోజుల్లో పంటలు చేతికందుతాయి..



ఇంకో నెల రోజుల్లో పంటలన్నీ చేతికి వస్తాయి. ఐదెకరాల్లో వరి, మొక్కజొన్న పంటలను పండిస్తున్నా. నీరు సరిగా అందకపోవడంతో వరిపొలాలు నెర్రెలు బారాయి. కరెంట్ ఉన్నా, నీటి కోసం గంట గంటకు మోటార్లు ఆన్‌చేయడంతో కాలిపోతున్నాయి. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. ఏమీ చేయాలో దిక్కు తోచని పరిస్థితి. ఐదెకరాలకు ఇప్పటికే రూ.లక్ష ఖర్చుపెట్టా.

– బుయ్య వెంకటి, రైతు, గంధసిరి

లిఫ్టు ఏర్పాటు చేయాలి..



ముదిగొండ మండలంలోని లిఫ్టులు ఏర్పాటు ప్రతిపాదన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్య లేకుండా చూస్తాం. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని చూస్తుంది. ప్రతిపాదనలు వస్తే, కొత్తవాటితో పాటు పాతవి మరమ్మతులు చేయించే అవకాశం ఉంటుంది. రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలి.

– తుపాకుల యలగొండస్వామి, ముదిగొండ సొసైటీ చైర్మన్

సత్తుపల్లికి రాష్ట్ర చైర్మన్ పదవి

ముఖ్వా అనుచరుల్లో హర్షాతిరేకాలు



రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన మువ్వా విజయబాబు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) కార్పొరేషన్ చైర్మన్ పదవి మువ్వా విజయబాబును వరించటంపై హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాధాన్యత లభించటం.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడైన మువ్వా విజయబాబుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాధాన్యత లభించే పదవి దక్కటం పట్ల విజయబాబు అనుచరుల్లో సంబురం నెలకొంది. ఆయనకు ఈ ప్రాంతంలో డీసీసీబీ చైర్మన్‌గా మంచి పట్టు ఉంది. జిల్లా రాజకీయాల్లో తనదైనశైలిలో రాజకీయంగా చక్రం తిప్పుతారనే పార్టీలో గుర్తింపు ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా కోరం కనకయ్య విజయంలో కీలకపాత్ర పోషించటమే కాకుండా జిల్లాలోనే కాంగ్రెస్‌పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించటంలో ముఖ్యపాత్ర వహించారు. రాష్ట్ర చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా బస్టాండ్ రింగ్‌సెంటర్‌లో మువ్వా విజయబాబు అనుచరులు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివవేణు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, నాగళ్ల భాస్కర్ చౌదరి, ఈడ్పుగంటి రామకృష్ణ, నాగళ్ల ప్రసాద్, తోట గణేష్, మొండెద్దు కృష్ణారెడ్డి, కాలినేని సాయిరాం, నాగరాజు ఉన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన మువ్వా విజయబాబు..

రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు కుటుంబ సమేతంగా ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్కే ఫౌండేషన్ సేవలు అభినందనీయం



లంకా కొండయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

మధిర: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆర్కే ఫౌండేషన్ ఎంతో పేరు ప్రతిష్ఠలు సాధించిందని భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్కే ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం స్థానిక రెడ్డి గార్డెన్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఆర్కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి దంపతులు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. మధిర ప్రాంతంలో వృద్ధుల కోసం అనాథ శరణాలయాన్ని నిర్వహిస్తున్నారని, వారందరికీ ప్రతిరోజు భోజనం ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న, మానవసేవే మాధవసేవ అని చెప్పిన భారతరత్న మదర్ థెరిస్సా మాటలను స్ఫూర్తిగా తీసుకొని ఎన్నో అవరోధాలను ఎదుర్కొని, ఆర్థిక ఇబ్బందులను తట్టుకొని మధిరలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లబోతు ప్రసాదరావు, మువ్వా రామకృష్ణ, లంకా ఫౌండేషన్ నిర్వాహకులు లంకా కొండయ్య పలువురికి సేవారత్న అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మి, ఎన్జీఓ అసోసియేషన్ డైరెక్టర్ కొడవటికంటి బాలరాజు, ఆజాద్ ఫౌండేషన్ డైరెక్టర్ మల్లికార్జున్, కోమటిడి శ్రీనివాసరావు, సామాజిక సేవకులు బొల్లెద్దు సంధ్య, న్యాయవాది అవ్వా విజయలక్ష్మి, రిటైర్డ్ ఎంపీడీఓ మాధవరపు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌బాబు

కల్లూరు: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు, జిల్లా అధ్యక్షుడు కళ్యాణపు కృష్ణయ్యలు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక విజ్ఞాన్ విద్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి అవలంభించిందన్నారు. పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్‌ను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు చేయాలని, కనీసం పెన్షన్ రూ.30 వేలు అందించాలని, ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని, మెడికల్ అలవెన్స్‌లు కనీసం రూ.3 వేలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు వేల్పుల కృష్ణయ్య, కార్యదర్శి కడియాల ఫ్రాన్సిస్, కోశాధికారి సముద్రాల పుల్లారావు, చెంచురెడ్డి, హుస్సేన్‌భేగ్, మోసన్న, ఉమామహేశ్వరరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైరా: వైరా రెండో వార్డులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ముఖ్య అతిధిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బత్తుల గీత, ఆలయకమిటీ సభ్యులు ఓర్సు శ్రీనివాసరావు, బండారి తిరుపతిరావు, వల్లపు కొండలు, నంబూరి రామారావు, ఓర్సు నారాయణ, నాగరాజు, కుమార్ బాబు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



లింగాలలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్: మండలంలోని లింగాల, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. అదే విధంగా శుభకార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన లింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దేవరపల్లి శ్రీను కుమారుడు దేవరపల్లి వంశీని, అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మట్టారి మధుసూదన్‌ను పరామర్శించారు. అదే విధంగా ఎర్రబోయినపల్లిలో మాజీ ఉపసర్పంచ్ ములగ అప్పారావు కుమారుడు నాగేంద్ర వివాహానికి హాజరై దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, పాపబత్తిని నగేష్, తురాబ్‌అలీ, ఎనుముల రాములు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే..

పెనుబల్లి: పెనుబల్లి గ్రామ నాయకులు బొర్రా మోహన్‌రావు, రాధా దంపతుల కుమార్తె వైష్ణవి ఓణీల అలంకరణ వేడుక, కుమారుడు భద్రినాథ్ పంచల వేడుకకు ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, పిల్లి నవీజన్, గూడూరు మాధవరెడ్డి, బొర్రా కోటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మల్లెల రాజా, మిట్టపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నిరుపేద కూలీ గోళ్లమూడి రాఘవులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాఘవులు కుటుంబాన్ని ఆదివారం ఎల్ఐసీ ఏజెంట్, కాంగ్రెస్ నాయకులు కంభంపాటి కాంతారావు పరామర్శించి బస్తా బియ్యంను వితరణగా అందించారు. రాఘవులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ పిచ్చయ్య, వరికూటి కోటేశ్వరరావు, మేరి, రాఘవమ్మ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవి బీసీకే ఇవ్వాలి

ముదిగొండ: ముదిగొండ సహకారసొసైటీ చైర్మన్‌గా కొనసాగుతున్న తుపాకుల యలగొండస్వామికి డీసీసీబీ చైర్మన్ పదవి ఇవ్వాలని బీసీ వర్గాలు, మండల ప్రజలు కోరుతున్నారు. జనాబాలో 60శాతంగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ పాలక వర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలని, డీసీసీబీ చైర్మన్ పదవికి అన్ని అర్హతలు కలిగి ఉండడంతో ఆయనకే ఇవ్వాలని జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన పదవులు దక్కడంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. జిల్లాలో మంచి పేరున్న యలగొండస్వామి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఆయనకే డీసీసీబీ చైర్మన్ పదవి దక్కాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగే వరకూ స్పందించరా..?



శిథిలావస్థకు చేరిన గరికపాడు పాత పంచాయతీ కార్యాలయం



పంచాయతీ కార్యాలయం మీద పెరిగిన వృక్షాలు

వైరారూరల్: మండలంలోని గరికపాడు పంచాయతీలో సుమారు మూడేళ్ల కిందట నూతన పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించి ప్రారంభించారు. అప్పటి నుంచి పల్లె పాలన కొత్త భవనంలోనే సాగుతుండడంతో పాత పంచాయతీ కార్యాలయాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దాంతో పాత భవనం శిథిలావస్థలకు చేరడమే కాకుండా పలు రకాల చెట్లు పెరిగి వృక్షాలుగా మారాయి. దీని పక్క నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపల్లలు ఆడుతుంటారు. భవనం ఎప్పుడు కూలుతోందనని ప్రజలు ప్రజలు భయందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు స్పందించి భవనం కూలి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైరా: ప్రతి నెలా 3వ ఆదివారం వైరాలో బోడేపూడి కళా నిలయం వారి ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహించే బోడేపూడి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జట్ల రంగారావు మాట్లాడారు. వేసవిలో వడగాల్పుల నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండలో బయటకు రావద్దన్నారు. కార్యక్రమంలో కళానిలయం సభ్యులు సుంకర సుధాకర్, బొంతు సమత, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, గుడిమెట్ల మోహన్‌రావు, మాదినేని రజిని, సుజాత, చలపతిరావు, నాగరాజు, రామారావు, ఉదయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి నివాళి



వెంకటేశ్వరరావు (ఫైల్)

వైరా: వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు , వైరా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, తొలితరం పత్రికా విలేకరి, న్యూస్ పేపర్ ఏజెంట్‌గా పని చేసిన దొడ్డా వెంకటేశ్వరరావు ఆదివారం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తదితరులు సంతాపం ప్రకటించారు.

మున్నూరుకాపు సంఘం నాయకుడు.. అడపా సత్యనారాయణ మృతి

కారేపల్లి: మండలంలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన, మున్నూరుకాపు సంఘం నాయకుడు అడపా సత్యనారాయణ(65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వజ్జా రామారావు, కాటేపల్లి నవీన్, సీపీఎం మండల కార్యదర్శి కె.నరేందర్, బీఆర్ఎస్ నాయకులు అడప పుల్లారావు, కడియాల రాజు, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, సుధాకర్, మున్నూరుకాపు సంఘం నాయకులు నర్సింహారావు, సత్యనారాయణ, రామారావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.



అడపా సత్యనారాయణకు నివాళులు అర్పిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

నేటి నుంచి 'పది' పరీక్షలు



కల్లూరులో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

తల్లాడ/కల్లూరు: నేటి నుంచి నిర్వహించే పది పరీక్షలకు తల్లాడ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మొత్తం 306 మంది హాజరు కానున్నట్లు ఎంఈఓ తెలిపారు. అదే విధంగా కల్లూరు మండలంలోని మొత్తం 692 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంఈఓ దామోదరప్రసాద్ తెలిపారు. తల్లాడ, లూర్దుమాతా పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రసూన, సుదర్శన్, డిపార్ట్ మెంటల్ అధికారులుగా శ్రీనివాసరావు, పవన్‌లు నియమితులయ్యారు. కల్లూరులో పరీక్షల నిర్వాహణకు చీఫ్ సూపరింటెండెంట్లుగా పి.నివేదిత, రమణయ్య, జోజప్ప, రామ్మూర్తిలు, డీఓలుగా రమేష్, పి.మధు, శ్రీనివాస్‌లు వ్యవహరించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు 9 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వైరా నియోజకవర్గంలో..



కారేపల్లి మోడల్ స్కూల్ దృశ్యం

కారేపల్లి/ఏన్కూరు: మండలంలోని 3 పరీక్ష కేంద్రాలు కారేపల్లి హైస్కూల్, మోడల్ స్కూల్‌తో పాటు, కోమట్లగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 539 మంది, ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరులో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 324 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ జయరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కారేపల్లి ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం (వైరా)లో విద్యనభ్యసిస్తున్న 60 మంది పదో తరగతి విద్యార్థులకు ఖమ్మం పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఏన్కూరులోని పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్రీనివాసరావు, స్వప్న, డిపార్టుమెంటల్ అధికారులుగా పుల్లయ్య, రాంచంద్రు వ్యవహారిస్తున్నట్లు తెలిపారు.

మధిర నియోజకవర్గంలో..



ఎర్రుపాలెం: బోర్డుపై నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

మధిర/ఎర్రుపాలెం: మండలంలో ఏర్పాటు చేసిన 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 959 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎర్రుపాలెం మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల, గురుకుల పాఠశాల, బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మూడు సెంటర్లలో మొత్తం 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించటం జరిగిందన్నారు. పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయ సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో స్మార్ట్ వాచీలు, సెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.